

బిరబిరా పరుగులు





శ్రీశైలం డ్యాం నుంచి మూడు గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు

- నిండుకుండను తలపిస్తున్న శ్రీశైలం డ్యామ్
- మూడు గేట్లు ఎత్తి నీటి విడుదల
- జలాశయం వద్ద పర్యాటకుల సందడి

శ్రీశైలం, జూలై 29: శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తడంతో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు మూడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసా గుతోంది. జూరాల, సుంకేశుల నుంచి వరద ప్రవా హం పెరగడంతో డ్యామ్ మూడు క్రస్టుగేట్లను సాయం త్రం 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 3,03,984 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 1,48,599 క్యూసెక్కులు మొత్తం 4,52,583 క్యూసెక్కుల మేర వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. సోమవారం సాయంత్రం 6 గంటల సమయా నికి 4,51,080 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశ యానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 879.20 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 184.2774 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 26,495 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసె క్కులు, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 76,056 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. కార్యక్రమంలో ముందుగా జలాశయం సీఈ కబీర్‌బాషా, ఏఈ శ్రీరామచంద్రమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి 6,7,8 గేట్లను ఎత్తి నీటిని వదిలారు. జలాశయం ఇన్‌ఫ్లో ఇలాగే కొనసాగితే మరో రెండు గేట్లు తెరిచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

శ్రీశైలం జలాశయం వద్ద పర్యాటకుల సందడి

శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో జలాశయం పరిసర ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా సందర్శకులు జలాశయం అందాలను వీక్షించేందుకు తరలివచ్చారు. దైవదర్శనార్థం శ్రీశైల క్షేత్రానికి విచ్చేసి ముందుగా భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని అనంతరం డ్యామ్‌ను వీక్షించేందుకు ఎగబడ్డారు. శ్రీశైలం డ్యామ్ నుంచి కిందకు దూకుతున్నపుడు ఎగసిపడుతున్న నీటి జల్లుల్లో తడుస్తూ, కేరింతలు వేస్తూ అక్కడి దృష్యాలను పర్యాటకులు వారి ఫోన్లలో చిత్రీకరించుకుంటూ ఆనందించారు. ఇదిలా ఉండగా పర్యాటకుల వాహనాలతో ఘాట్ రోడ్లన్నీ రద్దీగా మారాయి. వారాంతరాల్లో జలాశయాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

జింకల బెడద



- కృష్ణ జింకలతో రైతులు బెంబేలు
- గుంపులు గుంపులుగా పొలాలపై దాడి
- కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న వైనం
- పంటలను కాపాడాలని రైతుల వేడుకోలు

ఆదోని, జూలై 29:
జింకలు ముచ్చటగొలుపుతాయి. చెంగు చెంగున అవి ఎగురుతుంటే పిల్లలకైనా పెద్దలకైనా ఆనందమే. కానీ ఆదోని డివిజన్‌లోని కొన్ని గ్రామాల రైతులకు మాత్రం జింకలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒక్కసారిగా వందల జింకలు పత్తి, వేరుశనగ, వరి, కంది, ఆముదం వంటి పంటలపై దాడి చేసి నాశనం చేస్తున్నాయి. ఒకసారి ఒక మంద పొలాల మీదికి వచ్చిందంటే పంట ధ్వంసమైపోయినట్టే. పంటలను తిని, పీకేసి చేతికి అందకుండా చేస్తున్నాయి. ఆదోని డివిజన్‌లోని ఆదోని, ఆలూరు, ఆస్పరి, పత్తికొండ, చిప్పగిరి, హోలహర్వి, ఎమ్మిగనూరు, పత్తికొండ మండలాలతోపాటు కర్నూలు జిల్లా అంతటా రైతులకు జింకల బెడద తీవ్రమైంది. చాగి, నారాయణపురం, ధానాపురం ముసానహళ్లి కాత్రికి, పెద్దహోతూరు, జోహరాపురం, మొలగవల్లి తదితర గ్రామాల్లోనూ అదే పరిస్థితి.

జంకలకు ఆహారంగా పంటలు

ఒకప్పుడు పదుల సంఖ్యలో ఉన్న కృష్ణ జింకలు.. ఇప్పుడు వేలాదిగా పెరిగిపోయాయి. గ్రామ శివార్లలో గొర్రెల మందలను తలపించేలా తిరుగుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. మందల్లా వచ్చి పత్తి, వేరుశనగ, కంది, ఆముదం, వరి, మినుముల పంటలను.. మొక్క దశలోనే తినేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట వేసినప్పటి నుంచి కోత కోసే వరకు పొలాల వద్ద రేయింబవళ్లు కాపలా ఉండాల్సి వస్తోందని వాపోయారు. ఈ ఏడాది సాగు చేసి పంటల్లో సగం వరకు జింకలకు ఆహారంగా మారాయని పేర్కొన్నారు.



జింకల పార్కు ఏర్పాటుకు కృషి

2014లో కర్నూలులో స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జింకల పార్కు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఆ తరువాత ఏడాది ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండల పరిధిలోని దేవరగట్టు ప్రాంతంలో జింకల పార్కు ఏర్పాటుకు 250 ఎకరాల భూమిని సర్వే చేశారు. దీని కోసం గతంలో రూ.53.26 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. అటవీశాఖ అధికారులు తుంగభద్ర రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలోని 35, 36, 37 బీట్ కంపార్ట్‌మెంట్‌లో 12 అడుగుల ఎత్తులో కంచె వేయాలని నిర్ణయించారు. దీని కోసం రూ.29.65 కోట్లు ఖర్చవుతుందని అంచనా కూడా వేశారు. అలా కాకుండా పార్కు ఏర్పాటు చేస్తే రూ.14.72 కోట్లు అవుతుందని, ఐదేళ్లపాటు జింకల నిర్వహణకు రూ.29.65 కోట్లు ఖర్చవుతుందని ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జింకల పార్కుపై దృష్టి సారించలేదు. అప్పటి కార్మికశాఖ మంత్రిగా ఉన్న గుమ్మనూరు జయరాం కూడా పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ కూడా అచరణకు నోచుకోలేదు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడంతో ఇప్పుడైనా జింకల పార్కు ఏర్పాటు చేస్తారా? అని రైతులు వేచి చూస్తున్నారు.

ప్రతి ఏడాది ఇదే పరిస్థితి



నాకున్న 10 ఎకరాలలో పత్తి పంట సాగు చేశాను. జింకల సంఖ్య అధికం కావడంతో పత్తి పంటను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి వస్తోంది. ఏటా ఇదే పరిస్థితి. గతంలో జింకలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం గొర్రెల గుంపు కంటే అధికంగా ఉన్నాయి.

-కురువ లింగన్న, రైతు, మదిరె గ్రామం, ఆదోని మండలం



జింకల బారి నుంచి పంటలను కాపాడాలి



నాకున్న నాలుగు ఎకరాల పొలంలో పత్తి పంటను సాగు చేశాను. గుంపులు గుంపులుగా కృష్ణ జింకలు వచ్చి పంటలను మొలక దశలోనే తినేస్తున్నాయి. పంటలను తొక్కేస్తున్నాయి. పెట్టిన పెట్టుబడి అంతా మట్టిపాలవుతోంది. విత్తనం వేసినప్పటి నుంచి కాపు వచ్చేంత వరకు రాత్రి, పగలు కాపలా కాస్తున్నాం.

-గొల్ల సోమనాథ్, యువ రైతు, మదిరె గ్రామం, ఆదోని మండలం

ప్రభుత్వం చొరవ చూపాలి



జింకల పార్కును ఏర్పాటు చేసి పంటలను కాపాడాలి. ఆదోని డివిజన్‌లో అధికంగా జింకలు గుంపులు గుంపులుగా ఉన్నాయి. ఒక్కసారి పొలంలో పడితే పంట అంతా నాశనమే. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జింకలను పట్టుకుని శ్రీశైలం అడవుల్లో వదిలింది. చంద్రబాబునాయుడు జింకల పార్కును ఏర్పాటు చేసి జింకల నుండి పంటలను రక్షించాలి.

-కురువ పెద్దలింగన్న, ఉప్పరహాళ్, గ్రామం, కౌతాళం మండలం

ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ

అధికారులకు కలెక్టర్ ఆదేశం

కర్నూలు(కలెక్టరేట్), జూలై 29: ఆగస్టు ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టాలని కలెక్టర్ జి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సచివాలయాల సిబ్బందికి ఒక్కొక్కరికి 50 ఇళ్ల మ్యాపింగ్ చేశామన్నారు. అంతకంటే ఎక్కువగా ఉంటే మండలాల్లో ఉన్న ఇతర శాఖల సిబ్బందికి మ్యాప్ చేయాలని సూచించ్నారు. మొదటి రోజునే వంద శాతం పింఛన్లను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పరిషత్ సీఈవో, డీఆర్‌డీఏ పీడీ చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు



ప్రజల నుంచి అర్జీలను తీసుకుంటున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 29: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి గైర్హాజరైన జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా డీఆర్వోను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారుల హాజరును ఆయన పరిశీలించారు. ఈ మేరకు 15 మంది అధికారులు హాజరు కాకపోవడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వీరికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీఆర్వో మధుసూదన్‌రావును ఆదేశించారు. వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తాం

ఎస్పీ జి.బిందు మాధవ్




ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

కర్నూలు, జూలై 29: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చి ఫిర్యాదులను పరిష్కరిస్తామని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. సోమవారం స్థానిక కొత్తపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 105 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని ఎస్పీ జి.బిందుమాధవ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ నాగరాజు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు పాల్గొన్నారు.

- ముగ్గురు పిల్లలతో పూట గడవడమే కష్టంగా ఉన్న తనకు నగరంలోని వన్‌టౌన్‌కు చెందిన కత్తిర రాజు వెటర్నరీ ఆసుపత్రిలో అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని రూ.లక్ష తీసుకుని మోసం చేశాడని, అతనిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కర్నూలు బుధవారపేటకు చెందిన షేక్ మహబూబ్ బాషా ఫిర్యాదు చేశారు.
- 40 ఏళ్ల కిందట కొనుగోలు చేసిన నాలుగు సెంట్ల స్థలాన్ని తన తమ్ముడి భార్య మునెమ్మ వారి బంధువులతో కలిసి ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తోందని దేవనకొండ మండలం, గుండ్లకొండ గ్రామానికి చెందిన నాగమ్మ ఫిర్యాదు చేశారు.
- ధాన్యం కోసం మా బావ సోమన్న తనను కొట్టి గాయపరిచాడని వెల్దుర్తి మండలం లక్ష్మీపల్లెకు చెందిన కాంతమ్మ ఫిర్యాదు చేశారు.
- నా కుమారుడు సురేష్ బీటెక్ పూర్తి చేశాడు. బీజేఆర్ ఇన్ఫోటిక్ శ్రీ జేసువర్దన్ రాజ్ నా కుమారునికి సాఫ్టవేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.80వేలు తీసుకుని మోసం చేశాడని డోన్‌కు చెందిన టి.జంబులయ్య ఎస్పీ దృష్టికి తీసుకొచ్చాడు.
- నా భార్య జయమ్మ ఏటీఎం కార్డు నుంచి డబ్బులు డ్రా చేయడానికి కర్నూలులోని కొత్తబస్టాండు దగ్గర ఉన్న యూనియన్ బ్యాంకు ఏటీఎంలోకి వెళ్లింది. డబ్బులు రాలేదు.. తిరిగి బయటకు వచ్చేటప్పుడు ఇంతలో ఇద్దరు వ్యక్తులు ఏటీఎంలోకి వచ్చి ఏటీఎం కార్డుతో డబ్బులు డ్రా చేసి ఇస్తామని చెప్పి ఏటీఎం కార్డు మార్చారు. బయటకు వెళ్లిన పది నిమిషాల తర్వాత రూ.43వేలు డ్రా చేసినట్లు మేసేజ్‌లు వచ్చాయని, మోసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కర్నూలుకు చెందిన దేవరాజు ఫిర్యాదు చేశారు.
- కావ్యశ్రీ రియల్ ఎస్టేట్ పేరుతో ప్లాట్లు ఇస్తామని కంతులు కట్టించుకుని ఆఫీసులు తీసేసి, పేదవారిని మోసం చేస్తున్నారని పత్తికొండ మండలం నలగదొడ్డి గ్రామానికి చెందిన దుడుమన్న, చిన్నహుల్తి గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.
- నాగులాపురంలో ఉన్న రెండు ఎకరాల పొలాన్ని ముగ్గురు వ్యక్తులకు కౌలుకు ఇస్తే ఏకంగా ఆక్రమించుకోవాలని దౌర్జన్యం చేస్తున్నారని కర్నూలు చల్లావారి వీధికి చెందిన జ్ఞానేశ్వరమ్మ ఫిర్యాదు చేశారు.

ఆగస్టు 1న శ్రీశైలానికి సీఎం చంద్రబాబు



ఆత్మకూరు, జూలై 29: ద్వాదశ జ్యోతిర్లింగమైన శ్రీశైలం క్షేత్రానికి ఆగస్టు ఒకటో తేదీన సీఎం నారా చంద్రబాబు నాయుడు రానున్నారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేశారు. ముందుగా ఉదయం 10:30 సున్నిపెంటకు హెలీకాప్టర్ ద్వారా చేరుకుని అనతరం శ్రీశైలం క్షేత్రానికి రోడ్డుమార్గాన వెళ్తారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని శ్రీశైలం ప్రాజెక్ట్‌ను సందర్శించి నదీజలాలకు గంగ హారతి ఇస్తారు. తర్వాత ఏపీజెన్కో అధికారులతో సమావేశమై విద్యుదుత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తారు. అనంతరం సున్నిపెంట ప్రజావేదికకు చేరుకుని అక్కడ సాగునీటి రైతులు, అధికారులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటలకు సున్నిపెంట నుంచి శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి చంద్రబాబు వెళ్తారు. కాగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో అదే రోజు అక్కడ జిల్లా ముఖ్య నాయకులతో చర్చించే అవకాశం ఉంది.

కర్నూలు సబ్ రిజిస్ట్రార్‌గా ఫైరోజ్

కల్లూరు, జూలై 29: కర్నూలు సబ్ రిజిస్ట్రార్‌గా ఎన్.అబ్దుల్ రఫే ఫైరోజ్‌ను నియమిస్తూ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కళ్యాణి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్యాపిలి సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న ఫైరోజ్ ప్రస్తుతం బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం తాత్కాలికంగా కర్నూలు సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. బి.ప్రవీణ్‌కుమార్ స్థానంలో కర్నూలు సబ్ రిజిస్ట్రార్‌గా నియమించినట్లు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు తెలిపారు.

పూర్వ స్థానాలకు తహసీల్దార్లు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 29: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వివిధ జిల్లాల నుంచి తహసీల్దార్లు కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్ తహసీల్దార్లు తప్ప మిగతా తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు బదిలీ చేస్తూ కలెక్టర్ పి.రంజిత్‌బాషా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా వివిధ జిల్లాల నుంచి రిలీవ్ అయిన కర్నూలు జిల్లాకు చెందిన తహసీల్దార్లు డీఆర్వో కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు. వీరికి కలెక్టర్ కొత్త పోస్టింగులను బుధవారంలోపు ఇవ్వనున్నారు.

మోసం చేయడానికి మేమే దొరికామా..?

సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ఆదోని రూరల్ జూలై 29 : 'మోసం చేయడానికి మేమే దొరికామా.. మమ్మల్ని మోసం చేయడానిక మనస్సు ఎలా వచ్చింది.. పెట్టుబడి రాయితీని ప్రభుత్వం మాకు వేస్తే వాటిని బంధువుల ఖాతాలకు బదిలీ చేసుకుంటా' అంటూ పెద్ద హరివాణం రైతులు మండిపడ్డారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 2023-24లో ప్రభుత్వం ఆదోనిని కరువు మండలంగా ప్రకటించిందని అన్నారు. పెద్దహరివాణం గ్రామానికి చెందిన 1900 మంది రైతులకు పెట్టుబడి రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని, అయితే గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయక అధికారులు వందల సంఖ్యలో రైతుల ఖాతాలను మార్చి వారి బంధువుల ఖాతాల్లో జమ చేసుకున్నారని తెలిపారు. గ్రామ రైతు, టీడీపీ జిల్లా నాయకుడు దేవేంద్రప్ప మాట్లాడుతూ ఇదే అంశంపై ఆంధ్రజ్యోతి దినపత్రిక ఈ నెల 7వ తేదీన నిండా మోసం అన్న కథనాన్ని ప్రచురితం చేసిందని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చాడు. తప్పు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను సబ్ కలెక్టర్ ఆదేశించారు.

బంగారు నగల వ్యాపారి కిడ్నాప్ కలకలం



వెంకటేశ్వర్లు

గూడూరు, జూలై 29: కర్నూలు జిల్లాలో బంగారు నగల వ్యాపారి కిడ్నాప్ ఘటన సోమవారం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. గూడూరు మండల కేంద్రంలోని డమాం వెంకటేశ్వర్లు అలియాస్ కాశీ వెంకటేశ్వర్లు తన సోదరుడితో కలిసి బంగారు నగల వ్యాపారం చేస్తున్నాడు. డమాం వెంకటేశ్వర్లుకు ఎమ్మిగనూరు రోడ్డులో దాల్‌మిల్ దగ్గర పలు దుకాణాలు ఉన్నాయి. ఈ క్రమంలో రెండు రోజులుగా క్రితం గుర్తు తెలియని వ్యక్తులు తమకు షాపులను అద్దెకు ఇవ్వాలంటూ ఫోన్ ద్వారా సంప్రదించారు. తిరిగి సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి మళ్లీ వెంకటేశ్వర్లుకు ఫోన్ కాల్ వచ్చింది. అద్దె షాపులను చూపించేందుకు బైక్‌పై ఎమ్మిగనూరు రహదారిలో ఉన్న దాల్‌మిల్ దగ్గరకు వెంకటేశ్వర్లు వెళ్లాడు. అప్పటికే అక్కడ మకాం వేసిన గుర్తు తెలియని దుండగులు క్షణాల్లో స్కార్పియో వాహనంలో చేరుకుని వెంకటేశ్వర్లును బలవంతంగా వాహనంలో ఎక్కించుకుని పరారయ్యారు. జరిగిన సంఘటన అక్కడ ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. కొద్దిసేపటి తర్వాత వెంకటేశ్వర్లు సోదరుడు రాజుకు కిడ్నాపర్లు ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేశారు. ఆయన హుటాహుటిన పోలీసులకు సమాచారం అందించారు. కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్‌తోపాటు గూడూరు, కోడుమూరు ఎస్ఐలు హనుమంతయ్య, బాలనరసింహులు పోలీసులతో రంగంలోకి దిగి సీసీ పుటేజీలను పరిశీలించారు. డమాం వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసిన గుర్తు తెలియని దుండగుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేస్తున్నారు.

మల్లన్న సన్నిధిలో తెలంగాణ హైకోర్టు జడ్జి



ఆలయ ప్రాంగణంలో తెలంగాణ జడ్జి వేణుగోపాల్

శ్రీశైలం, జూలై 29: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను సోమవారం తెలంగాణ రాష్ట్రం హైకోర్టు జడ్జి వేణుగోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న జడ్జి వేణుగోపాల్‌కు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని తరువాత భ్రమరాంబికాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. జడ్జి వేణుగోపాల్‌కు ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 29: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతి ధరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అన్నారు. 171 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్‌చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డికి శిక్ష తప్పదు

సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), జూలై 29: గత ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి అండ చూసుకుని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకాలు సృష్టించాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మళ్లీ తామే అధికారంలోకి వస్తామన్న ధీమాతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆయన అనురుల దుర్మార్గాలపై బలైన బాధితులందరూ ఫిర్యాదులు చేసేందుకు బారులు తీరుతున్నారని అన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తుల కబ్జాలు చేసి పోగు చేసుకుని వాటికి సంబంధించిన రికార్డులన్నింటినీ పీఏసీ కాంత్ ఇంటికి తరలించారని, మిగిలిన ఆధారాలు కార్యాలయంలో లభ్యం కాకుండా మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో దహనం చేయించారని ఆరోపించారు. ఆయన చేసిన అరాచకాలకు పాపం పండి జైలు శిక్ష అనుభవించక తప్పదని అన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

ఏడుగురికి గాయాలు.. ఐదుగురిపై కేసు నమోదు

మంత్రాలయం, జూలై 29: మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన కురువ ఆడివప్ప, కురువ ఈరన్న అన్నదమ్ముల మధ్య పొలం విషయంలో ఘర్షణ జరిగింది. సోమవారం సూగూరు గ్రామ పరిధిలో ఉన్న 42 సెంట్ల పొలం విషయంలో ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఈరన్న, భూషమ్మ, లక్ష్మి, మాజీ సర్పంచ్ పద్మావతి, కురువ నరసింహులుపై ఆడివప్ప కొడుకు గోవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపీనాథ్ తెలిపారు. ఇందులో కురువ ఈరన్న, అతని భార్య మాజీ సర్పంచ్ పద్మావతిలకు తీవ్ర గాయాలు కాగా, కర్నూలు ఆసుపత్రికి తరలించారు. గోవర్ధన్, కురువ ఆడివప్ప, అతని భార్య లక్ష్మీతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయం

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- ఎస్సార్బీసీ, గోరుకల్లు రిజర్వాయర్‌కు నీటి విడుదల



ఎస్సార్బీసీకి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, జూలై 29: రైతు సంక్షేమమే టీడీపీ ధ్యేయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. పోతిరెడ్డిపాడునుంచి విడుదలైన కృష్ణా జలాలను సోమవారం, ఎస్సార్బీసీ, గోరుకల్లు రిజర్వాయర్‌కు ఆమె విడుదల చేశారు. బైపాస్ రెగ్యులేటర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గేట్లు ఎత్తి ఎస్సార్బీసీకి వెయ్యి కూసెక్కులు, గోరుకల్లు రిజర్వాయర్‌కు 5 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ రెండు నెలలుగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో రిజర్వాయర్లకు వరద పోటెత్తుతోందన్నారు. తుంగభద్ర, శ్రీశైలం రిజర్వాయర్లకు సంపూర్ణంగా నీరు వచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్షంతో గోరుకల్లు రిజర్వాయర్‌లో కుంగిన రాతిపరుపు మరమ్మతు పనులను రూ.కోటి నిధులతో యుద్ధప్రాతిపదికన చేపట్టామన్నారు. ప్రస్తుతం గోరుకల్లు రిజర్వాయర్‌లో మిగిలిన పనులకు రూ.98 కోట్లతో ప్రతిపాదనలు పంపించామన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. గోరుకల్లు ఈఈ శుభకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎస్సార్బీసీ కింద పొలాలకు వెయ్యి క్యూసెక్కులు, రిజర్వాయర్‌లోకి 5 వేల క్యూసెక్కులు పంపించడం జరుగుతుందన్నారు. క్రమక్రమంగా 9 వేల క్యూసెక్కులకు పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు అశ్వత్థనారాయణ, శివప్రసాద్, శ్రీదేవి, రాధాకృష్ణ, అమృతసాగర్, రామ్మోహన్, ఎంపీటీసీ రంగ రమేష్, మాజీ జెడ్పీటీసీ నారాయణమ్మ, టీడీపీ నాయకులు జయ రామిరెడ్డి, రమణమూర్తి, రామ్మోహన్‌నాయుడు, రాంపుల్లారెడ్డి, రామ గోవిందరెడ్డి, అమరసింహారెడ్డి, శివశంకరరెడ్డి, ఖాదర్‌బాష, బాల సుబ్బయ్య, నంద్యాల రవి, సురేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల జిల్లాకు 4,129 మెట్రిక్ టన్నుల ఎరువులు

నంద్యాల టౌన్, జూలై 29: జిల్లాకు వివిధ ఎరువుల కంపెనీల నుంచి 4,129 మెట్రిక్‌టన్నుల ఎరువులు వచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ, రేక్ ఆఫీసర్ ప్రసాదరావు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం నంద్యాల రైల్వే స్టేషన్‌కు ఎరువుల వ్యాగన్లు వచ్చాయి. క్రిభ్‌కో, ఫ్యాక్ట్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు ఇచ్చిన సమాచారం మేరకు అధికారులు ఎరువులను పరిశీలించారు. క్రిభ్‌కో నుంచి 1,150 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,650 మెట్రిక్ టన్నుల 10:26:26, ఫ్యాక్ట్ కంపెనీకి చెందిన 1,329 టన్నుల 20:20:20 ఎరువులను దిగుమతి అయ్యాయి. ఇందులో మార్క్‌ఫెడ్‌కు 575 మెట్రిక్ టన్నుల డీఏపీని కేటాయించడం జరిగిందని డీఏవో మురళీకృష్ణ తెలిపారు. వచ్చిన ఎరువులలో ప్రైవేటు డీలర్లకు, మార్క్‌ఫెడ్‌లకు, పీఏసీఎస్‌లకు అవసరాలకు అనుగుణంగా కేటాయించడం జరుగుతుందన్నారు.



పరిశీలిస్తున్న డీఏవో, తదితరులు

జిల్లాకు 1.70 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం

నంద్యాల జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లలో 2.36 లక్షల హెక్టార్లల్లో వివిధ పంటల సాధారణ విస్తీర్ణం కాగా ఇందు కోసం 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ తెలిపారు. ప్రస్తుతం 91,704 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతుల అవసరం, వినియోగాన్ని బట్టి ప్రతి నెల ఎరువులను జిల్లాకు తెప్పిస్తామన్నారు. ఎక్కడా ఎరువుల కొరత లేదన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పైసా వసూల్



రీ సర్వే పేరిట సర్వేయర్ల దందా

హొళగుంద, జూలై 29: గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే సర్వేయర్ల పాలిట కాసుల వర్షం కురిపించింది. హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో ఆరు నెలల క్రితం 6,393 ఎకరాల్లో రీసర్వే చేపట్టారు. ఇందులో భాగంగా పొలాలు సర్వే చేయగా వివాదాలు, భూముల విస్తీర్ణంలో భారీ వ్యత్యాసాలు చోటు చేసుకుంటున్నాయి. ఎక్కువ విస్తీర్ణంలో భూములు ఉన్న వారికి తక్కువగా ఉన్నట్టు రికార్డులో నమోదు చేశారు. ఒరిజినల్ ఆర్ఎస్ఆర్‌కు, రీ సర్వే రికార్డుకు పొంతన లేకపోవడంతో రైతులు సరిచేయాలని కోరారు. దీంతో అధికారులు ఆ గ్రామానికి చెందిన ఓ దళారిని పెట్టుకొని బేరసారాలకు దిగినట్లు తెలిపారు. దీంతో చేసేదిలేక రైతులు అధికారులు అడిగిన లక్షల రూపాయలు ఇచ్చుకున్నట్టు తెలుస్తోంది. డబ్బులు ముట్టజెప్పి నెలలు కావస్తున్నా ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు కాకపోవడంతోపాటు, కూటమి ప్రభుత్వం భూ రీసర్వేను రద్దు చేయడంతో రైతులు లబోదిబో అంటున్నారు. డబ్బులు ఇచ్చిన రైతులు సంబంధిత అధికారులను, దళారి ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ఏఎం ప్రసాద్ రాజును వివరణ కోరాగా రీసర్వేలో పాల్గొన్న సర్వేయర్లతో మాట్లాడతానని అన్నారు. రైతుల వద్ద డబ్బులు తీసుకున్నట్లయితే రైతులకు తిరిగి ఇప్పిస్తామని చెప్పారు.

రూ.63 వేలు తీసుకొని పని చేయలేదు



తొమ్మిది మంది మా అన్నదమ్ములకు సర్వే నెంబర్ 223/ఐలో 6.31 సెంట్లు పొలం ఉంది. ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా చూపుతోంది. ఒక్కొక్కరికి 0.70 సెంట్ల పొలం వస్తుంది. రీ సర్వేలో మా పేర్లు ఆన్‌లైన్‌లో వచ్చేలా చేస్తామని సచివాలయం సర్వేయర్లు డబ్బులు తీసుకొని ఇప్పుడు ఫోన్ చేస్తే స్పందించడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. నాతోపాటు మా గ్రామంలో చాలా మంది డబ్బులు ఇచ్చారు. అందరం మోసపోయాం. ఎలాగైనా డబ్బులు ఇప్పించాలని కోరుతున్నాం.

- మాకన్న రైతు, గజ్జెహళ్లి గ్రామం

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టిన పోలీసులు



బాల దస్తగిరి (ఫైల్)

కోవెలకుంట్ల, జూలై 29 : చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి గల్లంతైన సంఘటన కోవెలకుంట్లలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వర ప్రసాద్ వివరాల మేరకు.. కోవెలకుంట్ల మండల పరిధిలోని అమడాల గ్రామానికి చెందిన బాల దస్తగిరి (45) ఆదివారం చేపలు పట్టేందుకు కోవెలకుంట్ల నుంచి గుంజలపాడు వెళ్లే రహదారిలో రైల్వే వంతెన సమీపంలో ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లి గల్లంతయ్యాడు. బాల దస్తగిరి తిరిగి ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన బంధువులు కుంట వద్దకు వెళ్లి విచారించగా బాలదస్తగిరికి చెందిన దుస్తులు, చెప్పులు, వల అక్కడే ఉన్నాయి. దీంతో కుంటలో పడి గల్లంతైనట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకి వెళ్లి పరిశీలించి బాలదస్తగిరిని వెలికి తీసేందుకు గజ ఈతగాళ్లను పిలిపించారు. సాయంత్రం వరకు వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. 24గంటలు గడిస్తే తప్ప బాల దస్తగిరి ఆచూకీ లభ్యంకాదని పోలీసులు అంటున్నారు. రైల్వే కట్ట నిర్మాణ పనులు జరిగేటప్పుడు సమీపంలోని పొలంలో మట్టిని తవ్వగా పెద్దకుంటగా ఏర్పడింది. ఈ కుంటలో నీళ్లు ఉండడంతో స్థానికులు చేపలను వదిలి పెంచుకుంటున్నట్లు సమాచారం. అందుకోసం కుంటలో వలలు వేసి ఉండవచ్చని పలువురు చర్చించుకుంటున్నారు. బాలదస్తగిరి కుంటలో పడి వలలో చిక్కుకుని ఉండవచ్చని బంధువులు భావిస్తున్నారు.

పొలం గట్టు విషయంలో ఘర్షణ

- ఒకరి మృతి
- 8మందిపై కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 29: ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో పొలంగట్టు విషయంలో దాయాదుల మధ్య ఘర్షణ జరిగి కామయ్య(52)అనే రైతు మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ కామయ్యకు ఎస్.నాగలాపురం రోడ్డులో 2.70 ఎకరాల పొలం ఉంది. అతని దాయాదులకు చెందిన గోపాల్, నారాయణలకు కూడా భూమి ఉంది. ఇరువురి మధ్య కొంతకాలంగా పొలంగట్టు విషయంలో వివాదం నడుస్తోంది. సోమవారం పొలం దగ్గరకు కామయ్య అతని కుమారుడు పెద్దయ్యలు వెళ్లారు. పొలంలో గట్టు దగ్గర రాళ్లను సరిచేస్తుండగా పక్క పొలానికి చెందిన గోపాల్, వీరేష్, రామకృష్ణ, నారాయణలతోపాటు మరికొంతమంది కామయ్యతో వాగ్వాదానికి దిగారు. వాగ్వాదం కాస్తా ఘర్షణకు దారితీసింది. ఒక్కసారిగా బోయ కామయ్యపై గడ్డపార, చలికెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో కామయ్య కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు కామయ్యను ఎమ్మిగనూరుకు తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కర్నూలు రెఫర్ చేశారు. అంబులెన్స్‌లో కర్నూలుకు తీసుకెళ్తుండగా ఆస్పత్రికి చేరుకోగానే మృతి చెందాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. కాగా సమాచారం అందుకున్న ఎమ్మిగనూరు ఇన్‌చార్జీ డీఎస్పీ శివనారాయణస్వామి, రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కామయ్య కుమారులు, భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన గోపాల్, వీరేష్, రామకృష్ణ, ఉరుకుందమ్మ, కామయ్య, మహదేవ, నాగిరెడ్డి, నారాయణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య లింగమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు



మఠం హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

మంత్రాలయం, జూలై 29: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,69,35,189 వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు తెలిపారు. సోమవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురురాజా సభా ప్రాంగణ భవనంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య జూలైకి సంబంధించిన 32 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. నగదుతోపాటు 075.200 మి.గ్రా. బంగారం, కేజీ 900 గ్రాముల వెండి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వీటితో పాటు వివిధ దేశాల డాలర్లు కూడా వచ్చినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో జోనల్ మేనేజర్ శ్రీపతాచార్, దత్తుస్వామి, కృష్ణమూర్తి, అనంతపురాణిక్, సుజ్ఞానేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

దేవనకొండ, జూలై 29 : దేవనకొండ మూగితాత కొట్టాలకు చెందిన పెద్ద దస్తగిరి మూడు రోజులుగా కనిపించడం లేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ శ్రీనివాసులు దస్తగిరి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూల్‌డ్రింక్ షాపులో దొంగతనం

ఎమ్మిగనూరు టౌన్, జూలై 29 : పట్టణంలోని ఆదోని హైవే రోడ్డులో గల ఆర్‌జీవీ రెస్టారెంట్ ఎదురుగా హరిణీ కూల్‌డ్రింక్ షాపులో దొంగలు పడ్డారు. మల్కాపురానికి చెందిన జి.గోపీనాథ్ ఆదోని హైవే రోడ్డులో హరిణీ కూల్‌డ్రింక్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి యథావిధిగా షాపునకు తాళం వేసి వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి షాపు చూసే సరికి షాపు పక్కన రంధ్రం పెట్టింది చూసి షాక్ గురయ్యాడు. షాపులోని కూల్‌డ్రింక్స్ బాక్సులు, సిగరెట్లు, ఒక సిలిండర్, రూ. 2 వేల నగదు దోచుకెళ్లారు. సంఘటన గురించి బాధితుడు పోలీసులకు తెలపగా ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

గోనెగండ్లలో అనుమానిత డెంగీ కేసు



నిలువ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

గోనెగండ్ల, జూలై 29: మండల కేంద్రంలోని మూడో సచివాలయం పరిధిలో సోమవారం ఒకటి అనుమానిత డెంగీ కేసు నమోదు కావడంతో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఆ పరిసర ప్రాంతంలో నివాసం ఉంటున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి లార్వా, నీరు నిలువ ఉన్న డ్రమ్ములను, గచ్చులను పరిశీలించారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేశారు. డెంగీ సోకినట్లు అనుమానం ఉన్న కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వారి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. వైరల్ ఫీవర్‌గా నిర్ధారణకు వచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సూపర్‌వైజర్ హనుమంతు, సుధాకర్, ఏఎన్ఎం ప్రమీల, మాధవి పాల్గొన్నారు.

సర్పంచుపై తలారి అత్యాచార యత్నం

తప్పించుకొని గ్రామానికి చేరుకున్న బాధితురాలు

ఆదోని రూరల్, జూలై 29 : ఆదోని మండలం పెద్ద పెండేకల్లు గ్రామానికి చెందిన ఉప్పర జయమ్మపై అదే గ్రామ తలారి నరసింహులు అత్యాచార యత్నం చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. సర్పంచు జయమ్మ ఆదివారం ఉదయం శిరుగుప్పకు వెళ్లింది. సాయంత్రానికి గ్రామానికి వెళ్లే క్రమంలో ఆరేకల్లు క్రాస్ వద్ద ఆటో కోసం ఎదురు చూస్తోంది. ఆ సమయంలోనే గ్రామ తలారి నరసింహులు వచ్చి తన బైక్‌పై ఎక్కితే వదిలిపెడతానని చెప్పాడు. దీంతో జయమ్మ బైక్‌పై ఎక్కింది. తలారి కొండల్లోకి తీసుకెళ్తుండగా జయమ్మకు అనుమానం వచ్చి బైక్‌పై నుంచి దూకేసింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తోపులాట జరిగి జయమ్మ గాయాలపాలైంది. తలారి నరసింహులు నుంచి తప్పించుకొని రెండు కి.మీ., నడుచుకొంటూ గ్రామానికి చేరుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు నరసింహులు ఆచూకీ తెలుసుకొని దాడి చేశారు. అనంతరం సదరు మహిళ తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తలారి నరసింహులుపై అత్యాచార యత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

ఆస్తి కోసం అన్న హత్య

మృతదేహాన్ని బైక్‌పై తెచ్చి పడేసిపోయిన సోదరులు

సి.బెళగల్, జూలై 29: ఆస్తి తగాదాలతో తెలంగాణలో సొంత అన్న హతమార్చిన సోదరులు మృతదేహాన్ని తెచ్చి సరిహద్దున ఉన్న సి.బెళగల్ మండలంలో పడేశారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్దదన్వాడ గ్రామానికి చెందిన గోకారి కుమారుడు శేషిరెడ్డి(55)ని అతడి సోదరులు నాగిరెడ్డి, మహేశ్‌లు హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై ఆంధ్ర సరిహద్దులోని సి.బెళగల్ మండలంలోని కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద పడేశారు. విషయం తెలుసుకున్న కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, ఎస్ఐలు తిమ్మారెడ్డి, బాలనరసింహుడు, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు సంతానం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

కళాకారులకు ఏడు జాతీయ అవార్డులు



వివరాలను వెల్లడిస్తున్న పత్తి ఓబులయ్య

కర్నూలు(కల్చరల్), జూలై 29: శ్రీకృష్ణ కమలపాలిక పౌరాణిక పద్య నాటకానికి ఏడు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. కళా క్షేత్రం అధ్యక్షుడు, నాటక దర్శకుడు పత్తి ఓబులయ్యకు ఉత్తమ ద్వితీయ ప్రదర్శన అవార్డుతోపాటు ఆరు వ్యక్తిగత అవార్డులను కళాకారులు గెలుచుకున్నారు. సోమవారం టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అవార్డుల వివరాలు పత్తి ఓబులయ్య వెల్లడించారు. తిరుపతిలోని అభినయ ఆర్ట్స్ థియేటర్స్ సంస్థ ఏటా జాతీయ స్థాయిలో పౌరాణిక, సాంఘిక నాటక పోటీలు నిర్వహిస్తోందని అన్నారు. ఈ నెల 20 నుంచి 28 వరకు నిర్వహించినఈ జాతీయస్థాయి నాటక పోటీల్లో కళాక్షేత్రం కళాకారులు శ్రీకృష్ణ కమలపాలిక నాటకం ప్రదర్శించామని ఆయన తెలిపారు. ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత విజేతల వివరాలు ప్రకటించగా, అందులో ఏడు జాతీయ అవార్డులు కళాక్షేత్రానికి దక్కాయని ఆయన తెలిపారు. సమావేశంలో సీనియర్ కళాకారులు గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, లక్ష్మీకాంతారావు, ఇ. పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రికి అత్యాధునిక పరికరాలు



సిటీ సిమిలేటర్ యంత్రం

కర్నూలు(హాస్పిటల్), జూలై 29: కర్నూలులో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి సోమవారం చెన్నై, ముంబయిల నుంచి అత్యాధునిక పరికరాలు వచ్చాయి. ఇప్పటికే హాస్పిటల్ భవనాల నిర్మాణం పూర్తి కాగా, వైద్యులు పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. 30 కోట్ల విలువైన అత్యాధునిక లీనియర్ యాక్సిలరేటర్ యంత్రం 4 డీ సిటీ సిమిలేటర్ రూ.5 కోట్ల పరికరాలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు చేరాయి. కొత్త పరికరాలు రావడంతో త్వరలో రాష్ట్ర స్థాయిలో క్యాన్సర్ సేవలు అందుబాటులో వస్తాయని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్ తెలిపారు. ఈ లీనియర్ యాక్సిలరేటర్ స్వీడన్ నుంచి వచ్చిందన్నారు. పరికరాలను అమర్చిన తర్వాత వీటి సేవలను రోగులకు అందుబాటులోకి తెస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 29: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్ జ్యోతి సూచించారు. రవీంద్ర డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో విద్యార్థులు నగరంలో డయేరియా, మలేరియా వ్యాధుల నివారణకై ర్యాలీ నిర్వహించి అవగాహన నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ శ్రీనివాసులు చంద్రశేఖర్‌రావు, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎండీఈఎంవో డా.షరీఫ్ తబస్సుమ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ లక్ష్మీదేవి, ఆశా వర్కర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పీక్ ఈజ్ క్లబ్ ప్రారంభం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 29: మహిళా రవీంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం స్పీక్ ఈజ్ క్లబ్‌ను సోమవారం చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్‌తోపాటు కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ సౌత్ ఆసియా హెడ్ సురేష్ నారాయణ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్ అండ్ అసెస్మెంట్ టెర్రిటరీ మేనేజర్ మల్లికార్జున నాయుడులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవీంద్ర, పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు సర్టిఫికేషన్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ మాట్లాడుతూ స్పీక్ ఈజ్ క్లబ్ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేవీ శ్రీనివాసమూర్తి, వివిధ విభాగా ధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 29: జోహరాపురం పరిధిలోని బుడాన్ ఖాన్ మసీదు స్థలం అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని ఆవాజ్ కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి షేక్ మొహ్మద్ షరీఫ్ అధ్యక్షతన సభ్యులు ధర్నా నిర్వహించారు. ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాన్, మాజీ మంత్రి మూలింటి మారెప్ప, న్యూసిటీ కార్యదర్శి మహ్మద్ రఫీ, ఇంతియాజ్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 30: పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆరు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని పారిశుధ్య వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ జీతాలు చెల్లించాలని ఎంఈఓ, కలెక్టర్ ఎదుట ధర్నా చేసి వినతి పత్రాలు ఇచ్చినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ ఆగస్టు 5న ఎంఈఓ కార్యాలయం, 12 కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పని ఒత్తిడి తగ్గించాలని, ఎంఈఓ, ఉపాధ్యాయులు కార్మికులతో చట్టాలకు విరుద్ధంగా వివిధ రకాల పనులు చేయిస్తున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు పఠాన్ ఆసియా, ఉరుకుందమ్మ, జయంతి, జయలక్ష్మి, మహేశ్వరి, రమణమ్మ, జుబేదాబి పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు, జూలై 29: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో శ్రీరామ్‌నగర్‌లో సోమవారం చైన్ స్నాచింగ్ జరిగింది. హేమసాయి అనే మహిళ స్థానిక అర్బన్ హెల్త్ సెంటరులో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేస్తుంది. సోమవారం సాయంత్రం శ్రీరామ్‌నగర్‌లో ఉన్న ఓ చర్చి వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా.. మోటారు సైకిల్‌పై వెనుక నుంచి ఓ ఆగంతకుడు ఆమె మెడలో నుంచి బంగారు గొలుసును తెంపుకుని ఉడాయించాడు. బాధితురాలు కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. అపహరణకు గురైన గొలుసు మూడు తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రమణ

కల్లూరు, జూలై 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆగస్టు 1వ తేదీ వందశాతం పంపిణీ చేపట్టాలని కల్లూరు మండల ప్రత్యేక అధికారి రమణ సచివాలయ ఉద్యోగులు, సెక్రటరీ, వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం 6 గంటలకే గ్రామాలకు చేరుకుని పింఛన్‌దారులకు పింఛన్లు అందజేయాలని సూచించారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి: ఎస్ఈ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్ఈ డి.వేణుగోపాల్

కర్నూలు(న్యూసిటీ), జూలై 29: నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ డి.వేణుగోపాల్ సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. సోమ వారం నిర్వహించిన కార్యక్రమానికి వివిధ విభాగాలకు సంబంధించి 19 అర్జీలను స్వీకరించారు. మామిదాలపాడు, గీత ముఖర్జీనగర్ ,స్టాంటన్‌పురం ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని టీడీపీ 38, 39, 40 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి వై.రామేశ్వరరెడ్డి కోరారు. వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలోని విష్ణుటౌన్‌షిప్‌లో సీసీ రోడ్డు మంజూరు చేయాలని కాలనీ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు డా.పీపీ.సుధాకర్, గాయత్రీ ఎస్టేట్ బిర్లాగడ్డ, పందిపాడు సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని స్థానికుడు విజయనాయుడు, పెద్దమార్కెట్ లక్ష్మీన రసింహ స్వామి ఆలయం వద్ద ఓ వ్యక్తి పశువులను ఉంచి రహదారులను అపరిశుభ్రం చేస్తూ, ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తున్నారని ఉమ్మన్న, తెలుగు విజయ్‌కుమా ర్‌లు ఫిర్యాదు చేశారు. ఆరోరానగర్‌లో మాంసం విక్రయించే వ్యాపారులు వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయడంతో చుట్టుపక్కల దుర్వాసన వస్తుందని చర్యలు తీసుకోవాలని స్థానికుడు డి.రాజేంద్రప్రసాద్ అర్జీ ఇచ్చారు. ధర్మపేట రైల్వే బ్రిడ్జి వద్ద 5 నెలల క్రితం నిర్మించిన మరుగుదొడ్లకు తలుపులు విరిగిపోయాయని, నాసిరకమైన పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డి.రాజు కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి కే.విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, డీసీపీ సంధ్య, సెక్రటరీ నాగరాజు, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ ఎస్ఐలను అరెస్టు చేయాలి



ధర్నా చేస్తున్న సెక్యూరిటీ గార్డులు, సీఐటీయూ నాయకులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 29: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో లైంగిక వేధింపులకు పాల్పడిన ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ ఎస్ఐలను అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. సర్వజన వైద్యశాలలో ఏళ్ల తరబడి పని చేస్తున్న సెక్యూరిటీ గార్డులను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ సెక్యూరిటీ గార్డుల యూనియన్ సీఐటీయూ ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అంజిబాబు, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఆసుపత్రిలో నిజాయితీగా పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు బాలతిమ్మయ్యను అక్రమంగా ఎలా తొలగిస్తారని అన్నారు. ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ అవినీతి అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. లైంగిక వేధింపులకు గురైన మహిళా కార్మికురాలు స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిందనే కారణంగా ఏజెన్సీ ఎస్ఐలు ఫిరోజ్‌ఖాన్, రవితేజలను తొలగించకుండా వినతి పత్రం ఇచ్చిన బాధితురాలిని డ్యూటీ ఎలా నుంచి తొలగిస్తారని ప్రశ్నించారు. ఇద్దరు మహిళా సెక్యూరిటీ గార్డులను లైంగికంగా వేధిస్తున్న ఇద్దరు ఎస్ఐలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిసినా ఏజెన్సీ మద్దతు ఇస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ న్యూసిటీ అధ్యక్షుడు నరసింహులు, బిల్డింగ్ వర్కర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకరప్ప, ఓల్డ్ సిటీ ఉపాధ్యక్షులు రామకృష్ణ పాల్గొన్నారు.

కెనరా బ్యాంకు సేవలను వినియోగించుకోండి

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ చంద్ర



పొదుపు మహిళలకు చెక్కులు అందజేస్తున్న అశోక్ చంద్ర, విజయ భారతి

ఓర్వకల్లు, జూలై 29: కెనరా బ్యాంకు సేవలను పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ చంద్ర అన్నారు. సోమవారం ఓర్వకల్లులోని బాలభారతి పాఠశాల ప్రాంగణంలో ఓర్వకల్లు కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల చేయూత కార్యక్రమ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కెనరా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశోక్ చంద్ర, జీఎం ఐవీ మిథాన్ తాయ, ఏజీఎం స్వతంత్ కుమార్, మండల ఐక్య పొదుపు సంఘం గౌరవ సలహాదారులు విజయభారతిలు హాజరయ్యారు. కెనరా బ్యాంకు అందిస్తున్న సేవలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీఎం ఐవీ మిథాన్ తాయా మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాలు కలిగిన పొదుపు మహిళల కోసం త్రైమాసిక సగటున బ్యాంకులో రూ.5వేలు, రూ.30వేలు, రూ.లక్ష బీమా పొందుతూనే క్యాన్సర్, వ్యక్తిగత ప్రమాద బీమా క్యాన్‌కేర్‌బీ విమాన ప్రయాణం వర్తిస్తుందన్నారు. విజయ భారతి మాట్లాడుతూ 1997లో ప్రారంభించిన పొదుపు సంఘం దినాదినాభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం బాలభారతి పాఠశాలకు కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఐదు సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం పొదుపు మహిళలకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లాలోని కెనరా బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

వీఆర్వో గ్రేడ్-2 సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 29: ఏపీ వీఆర్వో గ్రేడ్-2 సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణకు ఏపీ వీఆర్వో గ్రేడ్-2 అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటరమణ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వో గ్రేడ్-2 నుంచి వీఆర్వో గ్రేడ్-1గా పదోన్నతులు కల్పించాలన్నారు. వీఆర్వో గ్రేడ్-2 ప్రొబిషన్ పీరియడ్ డిక్లేర్ చేయాలన్నారు. కార్యక్రమంలో కుమార్ యాదవ్, రాముడు, కిరణ్, భారతి, అపర్ణరెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పెంపకమే భవిష్యత్ తరాలకు బహుమతి



మొక్కను నాటి నీరుపోస్తున్న రాజేంద్ర చౌదరి

కర్నూలు(కల్చరల్), జూలై 29: చెట్ల పెంపకమే భవిష్యత్ తరాలకు అందించే గొప్ప బహుమతి అని సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషినల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి అన్నారు. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని కర్నూలు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో అమ్మ పేరిట ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్ర చౌదరి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రేడియో ప్రోగ్రాం హెడ్ డి.మురళి, క్షేత్ర కర్నూలు ప్రచార అధికారి పరావస్తు నాగసాయి సరి, కళాశాల ప్రిన్సిపాల్ డా.శాంత పాల్గొన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు(రూరల్), జూలై 29: మినీ గోకులాలకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏవీవో మోదీన్‌సాహెబ్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులు పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఆవాసానికి షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని. రైతు వాటాకు కలిపి ఉపాధి నిధులు మంజూరు చేస్తామని అన్నారు. దరఖాస్తుకు ఆధార్, జాబ్‌కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంకు ఖాతా జతపరచి సంబంధిత పశువైద్య కేంద్రంలో అందించాలని సూచించారు.

అన్ని పాఠశాలల్లో ఒకే సిలబస్ ఉండాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 29: అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకే సిలబస్ ఉండాలని యూటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఈవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వివిధ మేనేజ్మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృ తంగా ఉన్నాయని, పెరిగిన పనిభారంతోపాటు సమస్యలు పరిష్కారం కాక ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ కుమార్, రవికుమార్, నవీన్‌పాటి, హేమంత్ కుమార్, యేహోషువ, తిమ్మన్న, సోమన్న, జయరాజు, లతీఫ్, సురేష్, రఫీ, మారెప్ప పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడిని ఖండిస్తున్నాం: ఆప్టా

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 29: బలపనూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణపై విద్యార్థి తండ్రి గొడ్డలి కామాను తో భౌతికంగా దాడి చేయడం ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) కర్నూలు జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తుందని ఆప్టా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ కె.ప్రకాష్ రావు, జిల్లా అధ్య క్షుడు ఎం.మధుసూదన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.సేవాలాల్ నాయక్ అన్నారు. గత శుక్రవారం విద్యార్థులు పాఠశాల ప్రహరీని కూలగొట్టారు. అందుకు గాను ప్రధానోపాధ్యాయులు నారాయణ బాధ్యులైన విద్యార్థులను పిలిచి మందలించడంతో దీనిని తీవ్రంగా పరిగణించిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఒకరు హెచ్‌ఎంపై భౌతిక దాడి చేయడం దారుణమన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 29: విజయవాడలోని ఇందిరాగాంధీ మెమోరియల్ స్టేడియంలో ఆగస్టు 4వ తేదీ నుంచి 5 వరకు జరిగే అంతర్ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే పంచలింగాల కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థినులకు కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పతకాలు సాధించాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులైన అనూష, ఉదయ లక్ష్మి, దీపిక, స్రవంతి, మమతలను అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్ర సహాయక కార్యదర్శి నవీన్, వ్యాయామ ఉపా ధ్యాయురాలు గీతాంజలి, కిషోర్ పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 29: నగర పాలక సంస్థ పరిధిలో తొలగించిన పూడికతీత కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వై.వీ.రమణ డిమాండ్ చేశారు. సోమవారం నగర పాలక కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ నగర పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకొని 2023 మార్చిలో 180 మంది కాంట్రాక్టు కార్మికులను విధు ల్లోకి తీసుకుని 2024 మార్చిలో తొలగించారన్నారు. కార్మికులను పనుల నుంచి తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయ న్నారు. అనంతరం నగర మేయర్ బీవై.రామయ్య, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డికి వినతి పత్రాలు అందజేశారు.

ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు, జూలై 29: నగరంలో ట్రాఫిక్ పోలీసులు సోమవారం పలు చోట్ల తనిఖీలు చేశారు. సీఐ గౌతమి ఆధ్వర్యంలో ఆర్ఎస్ రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సరైన రికార్డులు లేకుండా వెళ్తున్న ఆటోలపై కేసు నమోదు చేశారు. డ్రైవర్లు లైసెన్సులు లేకుండా ఆటోలు నడుపుతుండటంతో వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అలాగే వినాయక ఘాట్ సమీపంలో రోడ్లపైనే తోపుడు బండ్లు, మొబైల్ క్యాంటీన్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే రాజ్‌విహార్ సర్కిల్, మౌర్య ఇన్ కూడళ్లలో మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు నడుపుతున్న పది మంది మైనర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రాముడు కుటుంబానికి గౌరు చరిత పరామర్శ



బాధితులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జూలై 29: కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, రైతు ఎల్లరాముడు విద్యుదాఘాతంతో మృతి చెందడంతో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత వారి కుటుంబాన్ని పరామర్శించారు. సోమవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ వద్దకు ఆమె చేరుకుని మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. ఆమె వెంట మండల టీడీపీ నాయకులు వాకిటి మాదేష్, ఎం.తిమ్మారెడ్డి, ఎం.దామోదర్‌రెడ్డి, కల్లూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎన్‌వీ రామకృష్ణ ఉన్నారు.

మొక్కలు పెంచండి

కోడుమూరు(రూరల్), జూలై 29: మొక్కలు పెంచడం మూలంగా వాతావరణం చల్లబడి సకాలంలో వర్షాలు కురుస్తాయని ముడుమ లగుర్తి సర్పంచ్ బోయ సువర్ణ అన్నారు. సోమవారం వనం మనం కింద గ్రామంలో సుమారు 600 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఉపాధి కూలీలతో చిన్నవంక, రోడ్డుకిరువైపులా కానుగ, వేప మొక్కలు నాటించినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ మధు తెలిపారు. టీడీపీ నాయకుడు మల్లేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గూడూరు, జూలై 29: గూడూరు నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేయిస్తున్నట్లు కమిషనర్ దివాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం గూడూరు పట్టణంలోని మునగాల రహదారిలో కాలువల్లో పూడికతీత పనులను కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఈ నరసింహులు, నగర పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నిరుద్యోగులకు కోచింగ్ సెంటర్ల మోసం

కర్నూలు(కలెక్టరేట్), జూలై 29: నిరుద్యోగులను మోసం చేస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఏఐవైఎఫ్ నాయకులు కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనివాసులు, బీసన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ రాబోతుందన్నారు. డీఎడ్, బీఎడ్ విద్యార్థులు టెట్, డీఎస్సీ కోసం వేల మంది విద్యార్థులు ప్రిపేర్ అవుతున్నారని అన్నారు. నగరంలోని కోచింగ్ సెంటర్లు విద్యార్థులతో వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్ర మంలో చంటి తదితరులు పాల్గొన్నారు.

కాలువను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(రూరల్), జూలై 29: గార్గేయపురం సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు రూరల్ మండలం గార్గేయపురం దాటిన తర్వాత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఈసందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు నీరు అందించే హంద్రీ నీవా కాలువను సూరత్ రోడ్డు వేసే కాంట్రాక్టర్ మట్టితో పూడ్చి చదును చేశారని ఆరోపించారు. తద్వారా కాలువ ద్వారా నీళ్లు వెళ్లకుండా అడ్డంగా మట్టి వేయడంతో వర్షాకాలం మొదలవడంతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రైతులకు నీరు అందించే పరిస్థితి ఉండదన్నారు. తక్షణమే కాలువను తిరిగి పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. కార్య క్రమంలో రాయలసీమ ప్రాజెక్టుల సాధన సమితి కన్వీనర్ డేవిడ్ రవి, ప్రజా సంఘాల హక్కుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ బి.రామ కృష్ణారెడ్డి కుమార్ రాజా, భాస్కర్ పాల్గొన్నారు.

సినారే సాహిత్య దృక్పథం ఆదర్శనీయం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 29: సుప్రసిద్ధ అభ్యుదయ కవి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత సినారే సాహిత్య దృక్పథం సమాజానికి ఆదర్శనీయమని రిటైర్డు తెలుగు ప్రొఫెసర్ హనుమంతప్ప అన్నారు. సోమవారం అరసం కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీయూ భవన్‌లో సినారే జన్మదినం సందర్భంగా నగర అధ్యక్షురాలు రాణి లీలావతి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అరసం నగర ప్రధాన కార్యదర్శి ప్రమోద్ చక్రవర్తి, అరసం సభ్యులు పవన్, లతా, దాసరి రమణ, డా.తిరుపతి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల నివాళి



నివాళులర్పించి మాట్లాడుతున్న గౌరు వెంకటరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

ఓర్వకల్లు, జూలై 29: ఓర్వకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయ కుడు గంగేశ్వరరెడ్డి సతీమణి జయమ్మ మృతి చెందడంతో సోమ వారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, కోడుమూరు టీడీపీ ఇన్‌చార్జి ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డిలు ఆమె భౌతిక కా యానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఓర్వకల్లుకు చెందిన టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మోహన్ రెడ్డి, అన్వర్‌బాషాలు సంతాపం తెలిపారు.

వృద్ధుడిని కాపాడిన క్యాజువాల్టీ వైద్యులు



రోగికి చికిత్స అందిస్తున్న డాక్టర్ రామశివ నాయక్

కర్నూలు(హాస్పిటల్), జూలై 29: డోన్ మండలం మిద్దెపల్లికి చెందిన 62 ఏళ్ల రామాంజనేయులు గుండెపోటుకు గురై కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. అతనికి సరైన చికిత్స అందించి క్యాజువాల్టీ వైద్యులు ప్రాణాలను కాపాడారు. సోమవారం ఉదయం రోగి క్యాజువాల్టీకి రాగా, ఎమర్జెన్సీ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ. డా.రామశివ నాయక్ రోగికి వెంటనే ఈసీజీ తీయించారు. అందులో గుండెకు మయోకార్డియో ఉన్నట్లు నిర్ధారించి వెంటనే రూ.49 వేల ఖరీదైన 40 ఎంజీ ఎల్రక్టీమ్ ఇంజెక్షన్ వేశారు. 45 నిమిషాల తర్వాత మళ్లీ ఈసీజీ పరీక్ష చేయగా.. అందులో మార్పులను చూసి కార్డియాలజీ విభాగానికి డా.రామశివనాయక్ రెఫర్ చేశారు. రోగి ప్రాణాలను కాపాడిన ఎమర్జెన్సీ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ డా.రామశివ నాయక్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.శారద, సీఎంవో డా.ఫయాజ్‌లకు బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. ఈసీజీ టెక్నీషియన్ సోమశేఖర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ దినేష్, సుధాకర్ పాల్గొన్నారు.

104 సేవలను వినియోగించుకోండి

ఓర్వకల్లు, జూలై 29: ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారి హేమలత కోరారు. సోమవారం మండలంలోని హుశేనాపురం పీహెచ్‌సీ పరిధిలోని కేతవరం గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 104 వాహనం ద్వారా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు, గర్భిణులకు పరీక్షలు, రక్తపోటు, షుగర్, పరీక్షలు నిర్వహించి ఉచి తంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి.బెళగల్, జూలై 29: రైతుల ఫిర్యాదులపై వీఆర్వోలు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ అనుపమ హెచ్చరించారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. తమ పొలాలను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మారందొడ్డి, పోలకల్లు, సి.బెళగల్, గుండ్రేవుల, ఇనగండ్ల గ్రామాల రైతులు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్ర మంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 29: జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సోమవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టర్ రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరిం చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లాలోని దళితుల భూములను ఆక్రమించు కుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీ భవన్‌ను పూర్తి చేయండి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 29: నగరంలోని జిల్లా బీసీ భవన్‌ను పూర్తి చేయాలని కోరుతూ సోమవారం బీసీ రిజర్వేషన్ల పోరాట సమి తి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ విద్యార్థుల సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి బీసీ భవన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ధనుంజయ ఆచారి, మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

నిందితులను పట్టుకుంటాం

● ఆదోని డీఎస్పీ శివనారాయణ శర్మ


పంప్‌హౌస్‌లో విధ్వంసానికి గురైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

మంత్రాలయం, జూలై 29: మండలంలోని మాధవరం, రాంపురం గ్రామాల మధ్య తుంగభద్ర నది ఒడ్డున ఉన్న గురు రాఘవేంద్ర ప్రాజెక్టు మాధవరం పంప్ హౌస్ స్టేజ్-1లో విధ్వంసం చేసిన నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని ఆదోని డీఎస్పీ శివ నారాయణ శర్మ తెలిపారు. సోమవారం మంత్రాలయంలో పంప్‌హౌస్ విధ్వంసం అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన డీఎస్పీ, కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ కృష్ణమూర్తి, ఎస్‌బీ ఎస్ఐ వేణుగోపాల్‌రాజు పంప్ హౌస్ వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ 4,200 ఎకరాలకు సాగునీరు అందించే పంప్‌హౌస్‌లో ఉన్న పరికరాలను కీలక బ్రేకర్లు, స్టాటర్లు, హెచ్‌పీ ప్యానల్, ఎల్‌పీ ప్యానెల్, ఇన్సులేటర్లు గుర్తు తెలియని వ్యక్తులు నది వైపు ఉన్న తలుపును పగులకొట్టి ధ్వంసం చేశారన్నారు. నిందితులను గుర్తించేందుకు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశామని, అదేవిధంగా క్లూజ్‌టీమ్‌తో వేలి ముద్రలు సేకరించి చర్యలు తీసుకుంటామన్నారు. జీఆర్‌పీ ఏఈ హరిప్రసాద్ చేసిన ఫిర్యాదుతో కేసు నమదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. తనిఖీల్లో జీఆర్‌పీ ఆపరేటర్లు మంచాల రాఘవేంద్ర, శ్రీనివాసులు, దాసు, తదితరులు ఉన్నారు.

పేదల సొంతింటి కళ నెరవేరుతుంది


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూలై 29: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో పేదలకు సొంతింటి కళ నెరవేరుతుందని మదనంతపురం టీడీపీ నాయకులు సంజప్ప, సుధాకర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కొక్క ఇంటికి రూ.4 లక్షలు ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. హంద్రీ నీవా కాలువ ద్వారా చెరువులకు నీరు నింపాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి


విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తున్న నాయకులు

దేవనకొండ, జూలై 29 : తెర్నేకల్ బీసీ బాలుర హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ అన్నారు.సోమవారం హాస్టల్ విద్యార్థులతో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. బీసీ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగినా సరైన గదులు లేవని, భవనాల సముదాయంలో ప్రహరీ లేకపోవడంతో రాత్రివేళల్లో విషపురుగులు సంచరిస్తున్నాయన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు. మండల అధ్యక్షులు మధు,ఉమేష్ ,సురేంద్ర,శివ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సలహాలు, సూచనలు తీసుకోవాలి

మద్దికెర, జూలై 29: మండలంలోని రైతులు సాగు చేసుకున్న పొలాల్లో పంటలు వేసి ఉంటే.. తెగుళ్లు సోకకుండా వ్యవసాయాధికారి సలహాలు సూచనలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉప్పర రవి అన్నారు. సోమవారం మండలంలోని ఎడవలి గ్రామంలో కంది పంటను పరిశీలించారు. కంది పంటకు వేరుకుళ్లు, ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి నెమ్మదిగా పసుపు రంగులోకి మారి కాండం కుళ్లిపోకుండా మూడు గ్రాముల కాపర్, గ్లైటాక్స్, ప్లాంటోమైసిన్ కలిపి మొక్కలకు పిచికారి చేయాలని తెలిపారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేసుకోండి

మద్దికెర, జూలై 29: పత్తికొండ తాలుకాలో జనసేన కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని జిల్లా జనసేన పార్టీ కార్యక్రమ నిర్వహణ కమిటీ సభ్యులు చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షుడు వైపీ క్రాంతి కుమార్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు జనసేన, పవన్ కళ్యాణ్ అభిమానులు కొత్త సభ్యత్వ నమోదు తీసుకోవడం వల్ల రూ.5 లక్షల బీమా, రూ.50వేలు ప్రమాద బీమా, పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బైరెడ్డి రవి, ఆనంద్, తదితరులు ఉన్నారు.

తుగ్గలి: జనసేన పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమానికి గడువు పెంచినట్లు జనసేన పార్టీ నాయకులు రాజేష్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ తదితర గ్రామాల్లో ఆయన జనసేన కార్యకర్తల పార్టీ సమావేశం నిర్వహించారు.

జనసైనికులంతా కష్టపడి పని చేయాలి


పవన్‌కళ్యాణ్‌తో లక్ష్మన్న

మంత్రాలయం, జూలై 29: మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర ఐక్యవాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బీ.లక్ష్మన్న అన్నారు. సోమవారం విజయవాడలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసి సభ్యత్వ నమోదుపై చర్చించారు. అలాగే మంత్రాలయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తా

తుగ్గలి, జూలై 29: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి అధికారులు సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీపీ ఎర్నానాగప్ప అన్నారు. సోమవారం తుగ్గలి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విజయలక్ష్మి, జడ్పీటీసీ పులికొండ నాయక్, జగన్నాథరెడ్డి, జిట్టా నగేష్, హనుమంతుతో పాటు స్థానిక నాయకులు ఆయనకు సన్మానం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, నాగభూషణం రెడ్డి, గుంతా రఘు, సుధాకర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఫక్కీరప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి


కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, జూలై 29: ఎమ్మిగనూరు పట్టణంలోని మైనార్టీ కాలనీలో ఉన్న కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, ఉదయ్‌కుమార్, సురేష్‌లు కలెక్టర్‌ను కోరారు సోమవారం కర్నూలులో ప్రజావేదికలో కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులకు సరైన సమయానికి భోజనం అందించకుండా నిర్లక్ష్యంగా ప్రిన్సిపాల్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో వేణు, తరుణ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన మార్కెట్ల వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆదోని టౌన్, జూలై 29: మార్చిలో జరగాల్సిన వివిధ మార్కెట్‌ల వేలాలు ఎట్టకేలకు సోమవారం మునిసిపల్ కౌన్సిల్ హాలులో కమిషనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ముగిశాయి. కాంట్రాక్టర్లు సిండికేట్ కాకపోవడంతో కాంట్రాక్టర్లు వేలంపాటలో పోటాపోటీగా పాల్గొన్నారు. రూస్నీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ గత ఏడాది రూ.71 లక్షలకు పాడగా, ఈ ఏడాది రూ.61.21లక్షలకు వాల్మీకి వీరేష్ దక్కించుకున్నారు. గొర్రెల సంత రూ.7.50 లక్షలకు అశ్వర్థ నారాయణ, ఎద్దుల సంత రూ.21.50 లక్షలకు రామాంజనేయులు దక్కించుకున్నారు. వేలం పాటలో రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాషా, ఆర్ఐ లవకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బినిగేరి టమోటా మార్కెట్‌కు వేలం

ఆస్పరి, జూలై 29: మండలంలోని బీణిగేర గ్రామంలో టమోటా మార్కెట్‌ను ఈరన్న రూ.10,02,500లకు వేలంపాట పాడి దక్కించుకున్నాడు. సోమవారం హోరాహోరీగా జరిగిన వేలం పాటలో మొత్తం ఐదు మంది పాల్గొన్నారు. వేలం పాటలో వచ్చిన మొత్తంలో సగభాగం గ్రామ అభివృద్ధి కోసం ఖర్చు చేసున్నట్లు మార్కెట్ యార్డు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి శేషాద్రినాయుడు, తలారి భీమన్న, రామాంజనేయులు, వెంకటేష్, నాగరాజ్ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు, జూలై 29: గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘం సమావేశం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేదన్నారు. మూడు పూటల తిండికి లేని కుటుంబాలు అనేకం ఉన్నాయని, అలాంటి కుటుంబాలకు ఆహారభద్రత చటానికి నిధులు కేటాంచి వారిని ఆదుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు లింగన్న, తిక్కన్న, రామాంజనేయులు, బాలకృష్ణ, నాగన్న, తిమ్మన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), జూలై 29: జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, సహాయ కార్యదర్శి మల్లికార్జున కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. రసూల్, వంశీ, సురేష్ పాల్గొన్నారు.

●ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను విడుదల చేయాలని అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి ఖాజ కోరారు. హాస్టల్‌కు సొంత భవనాలు నిర్మించాలన్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉద్యమిద్దాం

ఎమ్మిగనూరు, జూలై 29: దేశంలోనే విద్యలో వెనుకబడిన కర్నూలు జిల్లాలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఉద్యమిద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షకార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లాలు మాట్లాడుతూ జిల్లాలో 26మండలాలకు ఆదర్శపాఠశాలలు, గురుకులాలు, కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్ల ఉన్నా వేలాది మంది పేదబడుగు వర్గాలకు చెందిన విద్యార్థులకు సీట్లురాక చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పేదవిద్యార్థులకు హాస్టళ్లలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్ఎఫ్ ఐ జిల్లా 47వ ప్లీనరీ ఎమ్మిగనూరులో నిర్వహిస్తున్నామని, విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, నాయకులు రాము, అగ్గిరాముడులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 29: ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఎకరానికి రూ.20వేల ఆర్థిక సహాయం అందిస్తామని కూటమి వాగ్దానం చేసిందని ఈ మేరకు కౌలు రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి యేసేపు, తాలుకా నాయకులు ఉరుకుందు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వర్షాలు లేక పంటలు దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో శ్యాంసన్, చిన్నిప్రసాద్, రవి, షడ్రక్, లాజర్, కృష్ణ, రామచంద్ర, కేశన్నలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై రోడ్డెక్కిన మహిళలు


నిరసన తెలుపుతున్న మహిళలు

ఆలూరు, జూలై 29: ఇరవై రోజులైనా తాగునీరు సరఫరా కాకపోతే ఎలా అంటూ సీపీఐ నాయకులు చాపల గోపాల్ ఆధ్వర్యంలో కోయనగర్ మహిళలు ఆలూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆలూరు, గుంతకల్ ప్రధాన రహదారిపై బైఠాయించి తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి నచ్చజెప్పి పంపించారు.

● తాగు నీటి సమస్యపై స్పందించిన పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు...

ఆలూరులో తాగునీటి సమస్యపై ఆందోళన చేస్తున్న విషయాన్ని వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా గమనించిన గుంటూరు పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, కర్నూలు జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈకు ఫోన్ చేసి మాట్లాడారు.. సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఏమి చేయాలో ప్రతిపాదనలు ఇస్తే రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు నా వంతుగా కృషి చేస్తానని చెప్పినట్లు ఆంధ్రజ్యోతి ప్రతినిధికి రామాంజినేయులు తెలియజేశారు.

16 మందికి షోకాజ్ నోటీసులు

హొళగుంద, జూలై 29: మండలంలోని పలు సచివాలయంలో విధుల పట్ల నిర్లక్ష్యం, సమయపాలన పాటించని 16 మంది సచివాలయం సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో ఆజాద్ సోమవారం తెలిపారు. ప్రజలు సచివాలయానికి పనుల నిమిత్తం వెళ్లితే అందుబాటులో ఉండకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

విద్యుత్ మీటర్ ఇవ్వకుండా వేధించటం సరికాదు


ఏడీఏకు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

ఎమ్మిగనూరు, జూలై 29: పట్టణంలో ఎన్టీఆర్ కాలనీలో కూబా మసీదు పక్కన గుడిసెలో నివసిస్తున్న షబానా విద్యుత్ మీటరు కోసం డబ్బు చెల్లించినా మీటరు ఇవ్వకుండా వేధించడం సరైందికాదని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు అన్నారు. సోమవారం విద్యుత్ కార్యాలయం దగ్గర ఏడీఏ రాఘవేంద్రకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ బాధితురాలు షబానా ఈ ఏడాది జనవరి 24వ తేదీన ట్రాన్స్‌కోకు రూ.4వేలు చెల్లించడం జరిగిందని, అయినప్పటికీ మీటరు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ మీటరు విషయంపై ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సైతం సిఫార్సు చేశారన్నారు. అయినప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏడీ రాఘవేంద్ర మాట్లాడుతూ పరిశీలించి షబానా ఇంటికి మీటరు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజు, ఉస్మాన్, వలి, మాధన్న, చాంద్ బాషా, తాయప్ప, మక్బుల్ పాల్గొన్నారు.

నీటి ట్యాంకుల శుభ్రం


ట్యాంకులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

గోనెగండ్ల, జూలై 29: గోనెగండ్లలో గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే ట్యాంక్‌లను సోమవారం బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రం చేయించినట్లు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్‌కుమార్ తెలిపారు. వారు మాట్లడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో ఉన్న నీటి ట్యాంక్‌లను శుభ్రం చేయిస్తున్నామని తెలిపారు.

కాలువకు నీరు విడుదల


నీటిని విడుదల చేస్తున్న అధికారులు

కౌతాళం, జూలై 29: ఎల్ఎల్‌సీ నుంచి పంట కాలువలకు నీటిని విడుదల చేయాలని రైతులు, టీడీపీ నాయకులు ఇరిగేషన్ అధికారులు కోరారు. సోమవారం కౌతాళం మేజర్ కాలువ వద్ద టీడీపీ నాయకులు కాశీవిశ్వనాథ, రెడ్డెప్ప, రాజానగర్ శ్రీనురాజులు ముందుగా తూముకు పూజలు చేసి నీటిని వదిలారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది, నాయకులు రాజబాబు, మం జునాథ, రాంబాబు, పుగ్గి నాగ, గురుస్వామి, శివ, పింజారి బాబు, భీమయ్య ఉన్నారు.

రిజిస్ట్రేషన్ స్టాంప్ దందాపై విచారణ చేపట్టాలి

ఆదోని, జూలై 29: ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సాగుతున్న స్టాంపు దందాపై విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు, పట్టణ కార్యదర్శి సుదర్శన్, జిల్లా సమితి సభ్యుడు వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు సీపీఐ నాయకులు ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ స్టాంపులను అధిక ధరలకు విక్రయిస్తున్న స్టాంపు వెండర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కల్లుబావి రాజు, కుమార్ స్వామి, లక్ష్మీనారాయణ, కిరణ్ గౌడ్, గోపాల్, భీమేష్, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి


అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ఆదోని, జూలై 29: ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి, అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని అధికారులకు సూచించారు.

● పొలాలకు పిల్ల కాలువలు ద్వారా నీటిని అందిస్తే వరి నాట్లు వేయడానికి వీలు ఉంటుందని, పిల్ల కాలువలు ద్వారా సాగునీరు అందజేయాలని కౌతాళం గ్రామ రైతులు అర్జీ సమర్పించుకున్నారు.

● ఆదోని పట్టణం ప్రకాష్ నగర్‌కు చెందిన మీనాక్షి సంబంధించి, నాకు ఇద్దరు కూతుర్లు, పెద్ద కూతురు 9వ తరగతి, రెండో కుమార్తె 8వ తరగతి చదువుతోందని, సాంఘిక వసతి గృహంలో సీటు కల్పించాలని అర్జీ సమర్పించుకున్నారు.

● ఆదోని మండల పెద్దతుంబళం గ్రామానికి చెందిన వెంకటేష్‌కి సంబంధించి సర్వేనెంబర్ 412 నందు 7.00 ఎకరాలు, 413/2 నందు 1.63 ఎకరాలు, 256/2-ఏ నందు 0.97 ఎకరాలు, 256/2సీలో 2.31 ఎకరాల భూమి మొత్తం 11.91 ఎకరాల భూమి మా పెద్దల నుంచి సంక్రమించిందని, సదరు భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదైందని, విచారణ చేసి ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.

● ఆదోని మండలం జాలిమంచికు చెందిన చిన్న బీమయ్యకు సంబంధించి సర్వే నెంబర్ 36/2లో 36/3 నందు 2.50 ఎకరాల భూమి ఉండగా, సదరు భూమి 1.60 ఎకరాల భూమిని విక్రయించామని, మిగిలిన 90 సెంట్ల భూమి ప్రభుత్వ భూమిగా చూపిస్తుందని, సదరు భూమిని విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఏవో సీఆర్ శేషయ్య, సర్వేయర్ వేణు సూర్య, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఆర్టీసీ డీపో మేనేజర్ మహమ్మద్ రఫీ, ఆర్టీవో నాగేంద్ర, హౌసింగ్ డీఈ రవి కుమార్ పాల్గొన్నారు.

జింకల పార్కు ఏర్పాటు చేయాలి


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

పత్తికొండ టౌన్, జూలై 29: ప్రతి ఏటా రబీ, ఖరీఫ్‌లలో సాగు చేసిన రైతుల పంటలకు జింకల బెడద వల్ల అపార నష్టం జరుగుతోందని, పత్తికొండలో జింకల పార్కును ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రైతు విభాగం అసెంబ్లీ ఇన్‌చార్జి సీసీ రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీవో రామలక్ష్మికి బీజేపీ బృందం సభ్యులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఏటా జింకల బెడదతో రైతుల పంట పొలాలన్ని సర్వనాశనం అవుతున్నాయన్నారు. జింకల బెడదతో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం అందించాలన్నారు. నాయకులు కూనా మల్లికార్జున, బ్రహ్మయ్య, శంకరయ్య, భాస్కర్, గోరంట్ల, చంద్రన్న ఉన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టాలి


ఈవోకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ టౌన్, జూలై 29: పట్టణంలో వీకే ఆదినారాయణ రెడ్డి నగర్‌లో విద్యుత్ లైట్ల మరమ్మతులు చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కాలనీ వాసులు, గ్రామ పంచాయతీ ఈవో నరసింహులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వీకే నగర్, దిద్దిసేను కాలనీల్లో గత వారం రోజులుగా విద్యుత్ లైట్లు వెలగక పోవడంతో అంధకారంలో కాలనీవాసులు మగ్గుతున్నారన్నారు. వీధి లైట్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రంగన్న, శాఖ కార్యదర్శులు రవి, శంకర్, ఏఐవైఎఫ్ నాయకులు కారుమంచి నాగరాజు ఉన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేశారు

హొళగుంద, జూలై 29: వైసీపీ ప్రభుత్వంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను యథావిధిగా రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా నమోదు చేయడంతోపాటు, కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు బీజే పంపాపతి, దుబ్బ ఎరిస్వామి, జాకీర్, దిడ్డి వెంకటేష్, అబ్దుల్ సుభాన్, భాస్కర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారకు వినతిపత్రం అందించారు.

ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి

హొళగుంద, జూలై 29: హొళగుందలోని రాజానగర్‌లో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను పునః ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నాయకుడు శ్రీరంగ, సతీష్, కాకి గాదిలింగ, లింగా డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఎం ప్రసాద్ రాజుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలో వచ్చాక విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణాలతో ఎస్సీ హాస్టల్ మూసేశారని తెలిపారు. కార్యక్రమంలోశామ్యూల్ రాజ్, అజయ్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు, జూలై 29: కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సోమవారం గుంతకల్ క్రాస్‌లో పోలీసులు పట్టుకున్నారు. అందులో ఉన్న 30 మద్యం బాక్సులను స్వాధీనం చేసుకొని ఆలూరులోని కోయనగర్‌కు చెందిన బీ అశోక్‌ను అరెస్టు చేశారు. మొలగవల్లి గ్రామానికి చెందిన ఎరుకల సుధాకర్, కల్లుపరి శ్రీనివాసులు అనేక వారికి మద్యాన్ని సరఫరా చేసినట్లు విచారణలో తేలడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ, వాహనం కలుపుకొని మొత్తం రూ.2.50 లక్షల విలువ ఉంటుందని ఆమె తెలిపారు.

తాగునీటి జలాశయాలకు ప్రతిపాదనలు

హాలహర్వి, జూలై 29: మండలంలోని చింతకుంట, బాపురం గ్రామాల్లో తాగునీటి జలాశయాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ లక్ష్మన్న తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు జలాశయాలు నిర్మాణాకి నిధులు మంజూరైతే ఆలూరు ప్రజలకు తాగునీటి సమస్య ఉండదని, నిధులు మంజురుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు.

బయో మందులను విక్రయిస్తే చర్యలు

గోనెగండ్ల, జూలై 29: అనుమతి లేని బయో మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత హెచ్చరించారు. సోమవారం గోనెగండ్లలోని పెస్టిసైడ్ షాపులను వారు తనిఖీ చేశారు. బడేసావలి ట్రెడర్స్, మల్లికార్జున స్వామి ట్రేడర్స్‌తోపాటు మరికొన్ని షాపులను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పీసీ, జీ2, జీ3 సర్టిఫికెట్లను పరిశీలించారు.

రైతులందరికీ సాగు నీరందిస్తాం

నందవరం, జూలై 29: గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఆయకట్టు రైతులందరికీ సాగు నీరిస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరెడ్డి హామీ ఇచ్చారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పూలచింత ఎత్తిపోతల పథకం కింద 4500 ఎకరాలకు సాగునీరందించాలని అధికారులకు ఆదేశించడంతో డీఈ, ఏఈలు షైనర్ రిపేర్లు చేస్తున్నారన్నారు. రెండు రోజుల్లో నందవరం, కనకవీడు, కూలురు, నాగలదిన్నె గ్రామాల రైతులకు సాగునీరందుతుందని తెలిపారు.

యంత్రాలను ధ్వంసం చేయడం దారుణం

నందవరం, జూలై 29: మంత్రాలయం మండలంలో గుర్తు తెలియని వ్యక్తులు లచ్చమర్రి ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్‌లో యంత్రాలను ధ్వంసం చేయడం దారుణమని ఎల్లెల్సీ మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతుల పంటలకు సాగునీరంది పంటలు చేతికొచ్చే తరణంలో ఇలా చేయడం సరికాదన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి


బహుజన టీచర్స్ జెండాను ఆవిష్కరిస్తున్న బీటీఏ నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 29: ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రామశేషయ్య, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ కోరారు. సోమవారం బీటీఏ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదోనిలో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా జెండాను ఎగరవేసి మాట్లాడారు. జీవో 107ను రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అక్రమ బదిలీలకు కారకులైన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నందీశ్వరుడు, రామకృష్ణ, జనార్దన్, రాము, సుధాకర్, చిరంజీవి, రామన్న చంద్రశేఖర్, ప్రభుదాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానాన్ని అమలు చేయాలి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 29: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో ఒకే సిలబస్, ఒకే పరీక్ష విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప అన్నారు. సోమవారం ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించేందుకు కృషి చేయాలి అన్నారు. జీవో 117 రద్దు చేసి జీవో 55 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, మల్లికార్జున, రుద్రముని, ఉరుకుందయ్య, కృష్ణుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో దేశభక్తి, క్రమశిక్షణ

ఆదోని (అగ్రికల్చర్), జూలై 29: ఎన్‌సీసీతో దేశభక్తి క్రమశిక్షణ అలవర్చుకోవచ్చని వన్ ఆంధ్ర మెడికోల్ కంపెనీ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ రెడ్డి అన్నారు. సోమవారం నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను 120 మందిని ఆరోగ్య శారీరక పరీక్షలు నిర్వహించి ఎన్‌సీసీకి ఎంపిక చేశారు.